క్లుప్తంగా

కుష్టు వ్యాధి నిర్మూలనపై సర్వే

లింగాల : కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఆశా వర్కర్లు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. జనవరి 12వ తేదీవరకు జరిగే ఈ సర్వేలో ప్రతి ఇంటా ప్రతి ఒక్కరిని స్పర్శలేని మచ్చలు, తెల్ల పొడలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. స్పర్శలేని మచ్చలవల్ల భవిష్యత్‌లో కుష్టు వ్యాధికి సంబంధించి అంగవైకల్యం సంభవించే ప్రమాదం ఉందని ప్రజలకు వివరించి వారి పేర్లను నమోదు చేస్తున్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ పి.వి.రమణారెడ్డి, పీహెచ్‌సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

వేంపల్లె : స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం ఆదిత్యా బిర్లా గార్మెంట్స్ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఏపీఎం బాలస్వామి తెలిపారు. ఈ జాబ్‌మేళకు 18 ఏళ్ల నుంచి 32 ఏళ్ల వయస్సు ఉన్న మహిళలకు ఉచిత టైలరింగ్‌పై శిక్షణ ఇవ్వడంతోపాటు రూ.8350ల జీతం ఇవ్వనున్నారు. ఆసక్తి గల మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

సింహాద్రిపురం : మండల పరిధిలోని పైడిపాలెం గ్రామంలో ఈనెల 31వ తేదీన ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ గ్రామ సర్పంచ్ శివారెడ్డి తెలిపారు. ఈ వైద్య శిబిరానికి 40 ఏళ్లు నిండిన పురుషులు, మహిళలు కంటి పరీక్షలు ఉచితంగా చూపించుకుని శుక్లం ఉన్నవారికి కుట్లు లేకుండా అధునాత చికిత్స చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఐదుగురిపై బైండోవర్ కేసు నమోదు

జమ్మలమడుగు రూరల్ : మండలంలో శుక్రవారం ఐదుగురిపై బైండోవర్ కేసు నమోదు చేసి స్థానిక తహసీల్దార్ గురప్ప ఎదుట హాజరు పరచినట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు. గతంలో వీరిపై పలు కేసులు ఉండటం వల్ల వీరిపై బైండోవర్ కేసు నమోదు చేశామన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

చింతకొమ్మదిన్నె : గ్రామాల్లోని ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్యాధికారి నాగరాజు తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆజాద్‌నగర్‌లో డ్రైడే ప్రోగ్రాంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు ఇంటిలోని నీటితొట్లను పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. లెప్రసీ సర్వే ఆరోగ్యశ్రీ కార్డులు వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వెంకట్‌రెడ్డి, నాగలక్ష్మిరెడ్డి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో వలంటీర్లే కీలకం

ఎర్రగుంట్ల : ఇంటింటికి రేషన్ పంపిణీలో వలంటీర్లు బాధ్యతగా వ్యవహరించాలని తహసీల్దార్ ఏ నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి నెల 1వ తేదీ నుంచి 11వ తేదీలోగా రేషన్ పంపిణీ పూర్తి చేయాలన్నారు. వలంటీర్లు వారికి కేటాయించిన ఏరియాలలో అందుబాటులో ఉండి ఇంటింటికి రేషన్ అందించే చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాలతో పాటు వలంటీర్లు ఉండాలన్నారు. వాహనదారులు కూడా రేషన్ పంపిణీలో అలసత్వం చేయకూడదన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భైరవేశ్వరస్వామిని దర్శించుకున్న ఎండీ

వేముల : మండలంలోని నల్లచెరువుపల్లె గ్రామ సమీపాన మోపూరి కొండపై వెలసిన శ్రీభైరవేశ్వరస్వామిని న్యూటెక్ బయోసైన్సెస్ కంపెనీ ఎండీ డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి దర్శించుకున్నారు. తిరుపతి శ్రీవెంకటేశ్వర వెటర్నరీ బోర్డు మెంబర్‌గా ఉన్న ఈయన శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి భైరవేశ్వరస్వామి మూలవిరాట్‌ను దర్శించుకున్నారు. అనంతరం పైఅంతస్తులో ఉన్న భైరవేశ్వరస్వామికి పాలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంట్రాక్టర్ నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీయూసీ అంగన్‌వాడీ కమిటీ ఎన్నిక

పులివెందుల రూరల్ : పులివెందులలో మున్సిపల్ చైర్మన్ వి.వరప్రసాద్ సహకారంతో వైఎస్సార్‌టీయూసీ అంగన్‌వాడీ కమిటీ ఏర్పాటు చేసిన జిల్లా అధ్యుడు మల్లూరి జాషువ, అంగన్‌వాడీ కమిటీ అధ్యక్షురాలిగా పద్మావతి, ఉపాధ్యక్షులుగా లక్ష్మీ, సలీమాలను నియమించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నడూలేని విధంగా అంగన్‌వాడీలకు ఇచ్చిన మాట ప్రకారం జీతం పెంచారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఐదారు నెలలకు కూడా రానిజీతాలను ఇప్పుడు ప్రతి నెలా 5వ తేదీలోపు జీతాలు వేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రికే చెల్లుతుందన్నారు. కచ్చితంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాబోయే రోజుల్లో మనకు మంచి జీతాలు ఇస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ సంస్థ చైర్మన్ గంగిరెడ్డి, ఆర్పీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బండి మరియ, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు.. ఆదాయం బాగు

- అంతర పంటలతో అధిక ఆదాయం
- ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వ ప్రోత్సాహం



కమలాపురంలో మామిడి పంటలో అంతర పంటగా సాగు చేసిన వేరుశనగ పంట

కమలాపురం : ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతన్నలు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం గడిస్తున్నారు. దేశానికి రైతే వెన్నెముక అనే నానుడిని ప్రస్తుత ప్రభుత్వం నిజం చేస్తోంది. వ్యవసాయం భారం కాకూడదని భావించిన జగనన్న ప్రభుత్వం తక్కువ ఖర్చుతో సంవత్సరం అంతా ఆదాయం గడించే పంటల వైపు రైతన్నలు దృష్టి సారించేలా ప్రోత్సహిస్తోంది. దీంతో రైతన్నలు సైతం ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని సిరులు పండిస్తూ అధిక ఆదాయం గడిస్తున్నారు. ముఖ్యంగా ఎరువులు లేకుండానే కేవలం ప్రకృతి వ్యవసాయంతో పంటలు పండించేందుకు రైతన్నలు ముందుకు వస్తున్నారు. జామ, మామిడి, దానిమ్మ తదితర ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు అంతర పంటలుగా వేరుశనగ, మినుము తదితర పంటలు సాగు చేసి అధిక ఆదాయం గడిస్తున్నారు.

కషాయాలు తయారీ :

ప్రకృతి వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రకృతి వ్యవసాయంలో పంటలు పండించాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చని అధికారులు చెబుతుండటంతో రైతన్నలు సైతం ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారిస్తున్నారు. అవకాశం ఉన్న చోటల్లా ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో పంటలు సాగు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. రైతులు తమ పొలాల్లో సగం విస్తీర్ణంలో నైనా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండించేందుకు ముందుకువస్తున్నారు. మరి కొన్ని చోట్ల ఇంటి పెరట్లో వారికి సరిపడే కూరగాయలు, పండ్ల మొక్కలు నాటించి 365 రోజులు దిగుబడులు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



పక్క చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు జి.చెవిరెడ్డి, కమలాపురం పట్టణం. పట్టణ పరిధిలోని పుట్లంపల్లె పొలాల్లో తన భూమిలో 1.5 ఏకరాల్లో జామ పంట సాగు చేశాడు. ఎరువులు లేకుండా కేవలం ప్రకృతి వ్యవసాయం ద్వారా తయారు చేసిన జీవామృతంతో జామ పంటను పండిస్తున్నాడు. రాజమండ్రి నుంచి 1000 మొక్కలు తీసుకువచ్చి నాటాడు. మధ్యలో కొన్ని చెట్లు ఎండిపోయాయి. తిరిగి వాటి స్థానంలో జామ మొక్కలు నాటి పెంచుతున్నాడు. మొక్కలు, సాగు ఖర్చులు రూ.1 లక్ష అయింది. అయితే ఏడాదిలో రెండు సార్లు దిగుబడులు వస్తున్నాయని, దాదాపు రూ.3 లక్షలు వచ్చిందని, ఖర్చు పోను రూ.2 లక్షలు మిగిలిందని రైతు చెవిరెడ్డి సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.



చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు సుధాకర్‌రెడ్డి, కమలాపురం పట్టణం. మూలగడ్డ ఉన్న తన పొలంలో అర ఏకరాలో మాత్రమే జామ, దానిమ్మ, సీతా ఫలం పంటలను ఉపాధి హామీ ద్వారా నాటాడు. అలాగే పండ్ల తోటల మధ్యలో వంగ, మిరప, బెండ, అనప, మటిక, టమోటా, చిక్కుడు విత్తనాలు నాటాడు. వీటి చుట్టూ కంది, జొన్న పంటలు సాగు చేశాడు. విత్తనాలకు రూ. 3వేలు, కలుపు ఖర్చులు రూ.10వేలు. మూడు మాసాల్లో రూ.35వేలు వచ్చిందని, ఖర్చు పోను రూ.22వేలు మిగిలిందని రైతు సుధాకర్‌రెడ్డి సంతోషం వెలిబుచ్చాడు.

తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం గడించవచ్చు



ప్రస్తుత తరుణంలో ఎరువులకు అధిక డబ్బులు వెచ్చించాల్సి వస్తుంది. అదే ప్రకృతి వ్యవసాయంలో అయితే తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం వచ్చే పంటలు సాగు చేయవచ్చు. అలాగే దీర్ఘ కాలిక పంటలైన మామిడి, జామ తదితర పంటల్లో అంతర పంటలు కూడా సాగు చేసి ఆదాయం గడించవచ్చు. అలాగే భూములు లేని రైతులు తమ ఇంటి పెరట్లోనే పంటలు సాగు చేసుకోవచ్చు. ఇలా మండ లంలో 70 మంది ఇంటి పెరట్లో ప్రకృతి వ్యవ సాయం ద్వారా పంటలు సాగు చేయించాము. అలాగే దాదాపు 100 మంది రైతులతో పొలాల్లో అంతర పంటలుగా సాగు చేయించాము. ప్రస్తు తం రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగు లు వేస్తున్నారు. మంచి ఆదాయం గడిస్తున్నారు. – లత కుమారి, ఎల్–1 గ్రేడ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ దినేష్‌కుమార్‌రెడ్డి కిడ్నీలో రాళ్లు, కిడ్నీ వాపు, కిడ్నీ గడ్డలు, కిడ్నీ అండ్ యూరిన్ ఇన్‌ఫెక్షన్, మూత్ర సమస్యలు, పోస్టేట్ గ్రంథి సమస్యలు, అంగ సమస్యలు, చిన్నపిల్లల అంగం, చిన్నపిల్లల గజ్జల్లో వాపు, బీజము సమస్యలు, సెక్స్ సమస్యలు, పిల్లలు పుట్టకపోవడం తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అలాగే కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బుల సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

డ్రైనేజీ ప్రధాన కాలువ పనులు ప్రారంభం

చెన్నూరు : స్థానిక కొత్త గాంధీ నగర్ డ్రైనేజీ ప్రధాన కాలువ పనులను కాంట్రాక్టర్ నీలం వెంకటసుబ్బారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎంపీ నిధులనుంచి రూ.45 లక్షలతో రాజుల కాలనీ వద్ద నుంచి సరస్వతి నగర్, లక్ష్మీ నగర్, యానాదికాలని, గాంధీనగర్ మీదుగా బెస్త కాలనీ ప్రధాన డ్రైనేజీకి కలుపుతామన్నారు. ఈ డ్రైనేజీ పూర్తి అయితే డ్రైనేజీ సమస్యలు తీరిపోతాయన్నారు.

నేషనల్ హైవే బాధితులకు న్యాయం చేస్తాం

చెన్నూరు : కడప–కర్నూలు జాతీయ రహదారి చెన్నూరు కొత్త రోడ్డు వద్ద జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఇళ్లు, ఇంటి స్థలాలు కోల్పోయిన బాధితులకు న్యాయం చేస్తామని, వారికి త్వరలోనే ఇంటి పట్టాలు అందజేస్తామని ఆర్డీఓ జీఆర్ మధుసూదన్ తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని కనపర్తి గ్రామ పొలాల్లో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్ బాధితులకు సంబంధించిన సమస్యలను అలాగే జాతీయ రహదారిలో అసంపూర్తిగా నిలిచిపోయిన పనుల గురించి ఆర్డీవో దష్టికి తీసుకొచ్చారు. కాగా ఈ విషయాలపై ఆర్డీఓ మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణలో ఇళ్లు, ఇళ్ల స్థలాలు కోల్పోయిన బాధితులు 256 మంది ఉండగా, స్థానికంగా 76 మంది లేరని మిగిలిన 180 మందికి ఇంటి స్థలాలు కేటాయించామన్నారు. వీరికి ఇచ్చే స్థలాలు ఎగువ ప్రాంతంగా ఉండి ఇంటికి అనువుగా ఉండే విధంగా స్థలాలు కేటాయించామన్నారు. అంతేకాకుండా జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పెండింగ్‌లో ఉన్న సర్వీసు రోడ్లు, డ్రైనేజీ పనులు, అలాగే బస్ షెల్టర్ అన్ని కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పనులు తొందరగా జరిగే విధంగా చూస్తామన్నారు. అలాగే కనపర్తి లేఅవుట్లలో 987 మందికి ఇంటి స్థలాలు కేటాయించామని అందులో 53 మంది తమకు ఇంటి స్థలాలు వద్దని పట్టాలు వెనక్కి ఇచ్చారన్నారు. అయితే గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా మరో 24 మంది ఇంటి స్థలాలకు దరఖాస్తు చేసుకోగా అర్హులైన వారికి ఇంటి స్థలాలను కేటాయించామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రఘురాంరెడ్డి, తహసీల్దార్ పఠాన్ అలీఖాన్, సర్వేయర్ సోమశేఖర్, హౌసింగ్ ఏఈ మేనిల్, ఆర్ఐ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



నూతనంగా ప్రతిష్ఠించిన చౌడేశ్వరీదేవి

వీరపునాయునిపల్లె : మండలంలోని వెల్దుర్తి గ్రామంలో బుధవారం ప్రారంభమైన చౌడేశ్వరీదేవి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు శుక్రవారం ముగిసాయి. మూడు రోజులుగా నిర్వహించిన కార్యక్రమాల్లో గ్రామంలోని మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాల్లో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలు నిర్వహించడానికి చింతకొమ్మదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులుల్‌రెడ్డి రూ.లక్ష ఆర్థిక సాయం అందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రతి గడపకూ సంక్షేమాలతో లబ్ధి



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : జగనన్న ప్రభుత్వంలో ప్రతి గడపకూ సంక్షేమాల లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 1వ వార్డు ప్రకాశ్‌నగర్ కాలనీలో ఆయన మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డితో కలసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి అర్హత ఉండి ఏ పథకం అందని వారిని గుర్తించి అక్కడికక్కడే పరిష్కారానికి కృషి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవినీతికి ఆస్కారమివ్వకుండా, వివక్షకు తావులేకుండా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఏదో ఒక సంక్షేమ పథకాన్ని అందించి వారి ఆర్థికాభివృద్ధికి బాసటగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని నిండుమనస్సుతో ఆయనను ఆశీర్వదించాలని ఆయన ప్రజలను కోరారు. అలాగే వార్డులో ఉన్న డ్రైనేజీ సమస్యలను కూడా పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్, ఇన్‌చార్జి మోపూరి ప్రశాంత్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి దండే రవిప్రకాశ్‌లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు ఎస్ఐ కృష్ణంరాజునాయక్, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లు పంపిణీ



విద్యార్థులకు బాటిళ్లను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ

వేంపల్లె : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆర్థిక సహకారంతో స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేసినట్లు ఆ పాఠశాల హెడ్మాస్టర్ నారాయణమ్మ తెలిపారు. శుక్రవారం వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రిల చేతులమీదుగా 720 మంది విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధి కోసం కోట్లాది రూపాయలను ఖర్చు చేశారన్నారు. జగనన్న విద్యా కానుకలతోపాటు నాడు–నేడు కింద పాఠశాలల ఆధునీకరణ చేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పిస్తున్నారన్నారు. ముఖ్యంగా లక్షల మంది విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లను పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు బాబాషరీఫ్, రహమతుల్లాఖాన్, నాయకులు విశ్వనాథయాదవ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల తనిఖీ



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనాథరెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలోని జగనన్న హౌసింగ్ కాలనీలో జరుగుతున్న సిమెంటు రోడ్డు పనులతోపాటు పలు అభివృద్ధి పనులను శుక్రవారం మున్సిపల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనాథరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, మున్సిపల్ ఇంజనీర్లతో కలిసి సమావేశం నిర్వహించి మాట్లాడారు. వీలైనంత త్వరగా అన్ని అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

రసవత్తరంగా ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



కోమన్నూతలలో కబడ్డీ ఆడుతున్న యువకులు

సింహాద్రిపురం : రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ఉండే క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయడానికి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల కార్యక్రమం నిర్వహిస్తోంది. మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని వైఎస్ఆర్ ఆర్ జూనియర్ కళాశా క్రీడా మైదానంలో మూడవ రోజు శుక్రవారం ఆటల పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఈ ఆటల పోటీలు మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో జరుగుతాయని.. ఈ పోటీలవల్ల గ్రామాల్లో ఉండే క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీస్తారన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

లింగాల : మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా పోటా పోటీగా కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఆయా గ్రామాల పరిధిలోని యువకులు ఉత్సాహంగా కబడ్డీ పోటీలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేంద్రనాథ్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎరువు దుకాణాల తనిఖీ

చెన్నూరు : స్థానిక ఎరువుల దుకాణాలను శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి ఆదేశాల మేరకు బద్వేల్ వ్యవసాయ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ ఆకస్మిక తనిఖీ చేసి పలు రిజిస్టర్ లను, రశీదులను పరిశీలించారు. అనంతరం ఆయన దుకాణ యజమానులతో మాట్లాడుతూ ఇన్వాయిస్, బస్తా తూకం, లైసెన్స్ గడువు వంటి అంశాలపై వారికి పలు సూచనలు చేశారు. కొనుగోలు చేసిన ప్రతి రైతుకు తప్పని సరిగా రశీదు ఇవ్వాలని రైతు సంతకం, మొబైల్ నంబర్ తప్పక సేకరించాలన్నారు.

నాణ్యమైన ఎరువులను మా త్రమె అమ్మాలని తడిసిన, గడ్డకట్టిన ఎరువులను ఎట్టి పరిస్థితుల్లో అమ్మరాదన్నారు. కొనుగోలు స మయంలో ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. తనిఖీలో మండల వ్యవసా య అధికారి శ్రీదేవి, రైతు భరోసా కేంద్ర సహాయకులు చరణ్ పాల్గొన్నారు.

నూర్‌బాషా దూదేకుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా రసూల్



పులివెందుల రూరల్ : నూర్‌బాషా దూదేకుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా రసూల్‌ను నియమించారు. శుక్రవారం పులివెందులలో ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకంతో నాకు రాష్ట్ర నూర్‌బాషా దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చినందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. రాష్ట్రంలో నూర్‌బాషా దూదేకుల సంఘాన్ని బలోపేతం చేసే విధంగా తన వంతు సహాయ సహ కారాలు అందిస్తానన్నారు. అలాగే 2024 ఎన్నికలలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అత్యధిక సీట్లు వచ్చే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నూర్‌బాషా దూదేకుల ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

వైభవోపేతంగా శ్రీ సీతారాముల కల్యాణం

వల్లూరు : స్థానిక తూర్పు వీధిలో వెలసిన శ్రీ కోదండ రామాలయంలో శుక్రవారం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. రెండు రోజులుగా జరుగుతున్న ఆలయ ధ్వజ స్తంభ పునః ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా ఉదయం వేద పండితులు గర్తం పూజను నిర్వహించారు. యంత్రాల అభిషేకం అనంతరం నవధాన్యాల సమర్పణ జరిగింది.

అనంతరం ధ్వజ స్తంభ ప్రతిష్టను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహా పూర్ణాహుతి, సంప్రోక్షణ నిర్వహించారు. అనంతరం కల్యాణ మహోత్సవంలో భాగంగా శ్రీ సీతా రాముల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేశారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, పాద ప్రక్షాలన, కన్యాదానం, జీలకర్ర బెల్లం ధారణ, కంకణ ధారణ, మాంగళ్య ధారణ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ముత్యాల తలంబ్రాల కార్యక్రమం జరిగింది. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు పోలేపల్లె చైతన్య కుమార్ దంపతులు పాల్గొన్నారు.

నూతన భవనాలలో విధులు ప్రారంభం



నూతన పోలీస్‌స్టేషన్ భవనంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న రూరల్ సీఐ, ఎస్ఐ, తదితరులు

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని నూతన తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ భవనాలను ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ నూతన భవనాలలో శుక్రవారం తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణమూర్తి, పోలీస్‌స్టేషన్‌లో పులివెందుల రూరల్ సీఐ బాల మద్దిలేటి, ఎస్ఐ రోషన్, ఆయా అధికారులు నూతన భవనాలలో ప్రత్యేక పూజలు చేసి విధులు నిర్వహించారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సింహాద్రిపురం మండల అభివృద్ధిపై ప్రత్యేక చొరవ తీసుకోవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేగంగా జరుగుతున్న మైదానం పనులు



పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కమలాపురం : ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణకు ఎంపిక చేసిన సీఎస్ఐ చర్చి గ్రౌండ్ పనులు శర వేగంగా జరుగుతున్నాయి. నియోజకవర్గస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణకు పెద్ద క్రీడా మైదానం సిద్ధం చేయాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశించడంతో జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి సొంత నిధులతో ఐదు ఈవెంట్లలో క్రీడా పోటీలు నిర్వహించేందుకు ప్లే గ్రౌండ్ సిద్ధం చేస్తున్నారు. డోజర్‌తో గ్రౌండ్ మొత్తం శుభ్రం చేశారు. జేసీబీతో పాటు ట్రాక్టర్లు ఏర్పాటు చేస్తామని గ్రౌండ్ చుట్టూ ఉన్న కంపచెట్లు, మట్టి తొలగించి శుభ్రం చేయాలని జడ్పీటీసీ నిర్వాహకులకు సూచించారు. మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌సీ పుల్లారెడ్డి, మర్రి సుబ్బన్న, సురేష్‌యాదవ్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మయూర శిఖ అలంకారంలో వాసవీ మాత



వేంపల్లె : స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ధనుర్మాసం మూడవ శుక్రవారం పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మూల విరాట్ అమ్మవారు గజలక్ష్మీదేవి అలంకారంలో, ఉత్సవ విగ్రహం అమ్మవారు మయూరి శిఖ అలంకారంలో దర్శనమిచ్చారని వేంపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనుర్మాసం మహా విష్ణువుకు ప్రీతికరమైన మాసమని.. ఆలయంలో ప్రతిరోజు సూర్యోదయం ముందు తెల్లవారుజామున 5 గంటల నుంచి అమ్మవారి ప్రాకారోత్సవం నిర్వహిస్తారన్నారు. అర్చకులు ఇంద్రకంటి పరసాద్ శర్మ నేతృత్వంలో అందార బంధూరమైన ప్రపంచంలో అహింసా జ్యోతిని వెలిగించారు. శ్రీవాసవీమాత అమ్మవారికి అభిషేకం, పంచ హారతులు, నక్షత్ర హారతి, కుంభ హారతులతోపాటు విశేష పూజలు నిర్వహించామన్నారు. అలాగే శ్రీగోదా వెంకటేశ్వరస్వామి వారికి మాల పరివర్తనకై ంకర్యాలు, తదితర పూజలు నిర్వహించామన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు జి.హరికృష్ణ, మహిళా మండలి అధ్యక్షురాలు బి.భాగేశ్వరమ్మ, ఆర్యవైశ్య, ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు, వాసవీ కల్యాణ మండపం, మహిళా మండలి కార్యవర్గ సభ్యులు, ఆర్యవైశ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మండలంలో వికసిత భారత్ సంకల్ప యాత్రలు

లింగాల : మండలంలోని లోపట్నూతల, పార్నపల్లె గ్రామాల్లో శుక్రవారం వికసిత భారత్ సంకల్ప యాత్రలను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందుతున్న వివిధ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం పీఎం ఉజ్వల్ భవిష్యత్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులందరికి ఈ పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్లను ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీపై ప్రజల్లో అవగాహన కల్పిద్దాం



మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి

వల్లూరు : ప్రజా వైద్యానికి పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.25 లక్షల వరకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో సైతం ఉచితంగా వైద్య సేవలను అందించడానికి చర్యలు చేపట్టిందని మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం జరిగిన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు మండలంలో రబీ పంటగా మినుము పంటను అధికంగా సాగు చేశారని, వర్షాభావ పరిస్థితులు, తెగుళ్ల కారణంగా తీవ్రంగా నష్టపోయారని వారిని ఆదుకోవడానికి అధికారులు కృషి చేయాలని అన్నారు. ఆయన సూచన మేరకు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఎంపీడీవో జయశ్రీ మాట్లాడుతూ జనవరి 18వ తేదీ నుండి మండలంలో వికసిత భారత్ సంకల్ప యాత్ర జరుగుతుందని, గ్రామస్థాయిలో జరిగే ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవడం ద్వారా ప్రజా ప్రతినిధులు విజయవంతం చేయాలని అన్నారు. తహసీల్దార్ శంకర్‌రావు మాట్లాడుతూ భూముల రిజిస్ట్రేషన్ జరిగితే ఆటోమేటిక్‌గా మ్యుటేషన్ జరిగే విధంగా ప్రభుత్వం ఆటో మ్యుటేషన్ పద్ధతిని అమలులోకి తీసుకురావడం శుభ పరిణామమని, దీని వలన కొత్తగా భూములు కొన్నవారు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. దీని కింద ఇప్పటికే మండల పరిధిలోని పెద్దపుత్త గ్రామంలో ఒక మ్యుటేషన్ జరిగిందని తెలపారు. జగనన్న భూ హక్కు – భూ రక్ష కార్యక్రమం కింద గ్రామాల్లోని స్థలాల రీసర్వే జరుగుతోందని ఈవోపీఆర్‌డీ ప్రసాద్ తెలిపారు. మండలంలో ఇప్పటికే కొన్ని గ్రామాల్లో పూర్తి కగా, మిగిలిన గ్రామాల్లో త్వరలో కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతుందని, ప్రజా ప్రతినిధులు సహకరించాలన్నారు. పంట సాగుకు సంబంధించి ఈ క్రాప్ నమోదు జరుగుతోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో సాయి జ్యోతి తెలిపారు. అనంతరం పలు శాఖలపై సమీక్ష నిర్వహించారు. అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.